క్లుప్తంగా

పురస్కార గ్రహీత రాజర్షికి సత్కారం



రాజర్షిని సన్మానిస్తున్న చిలకమర్తి ఆర్ట్ అసోసియేషన్ సభ్యులు

కొయ్యలగూడెం: కళాకారునిగా ప్రస్థానం సాగించి అవార్డులు సాధించి ఏజెన్సీ మెట్ట ప్రాంతానికి పేరు తీసుకురావడంలో మహాశివబట్టు వెంకట రాజర్షి విశేష కృషి చేశారని చిలకమర్తి ఆర్ట్ అసోసియేషన్ పేర్కొంది. ఆదివారం కొయ్యలగూడెంలోని రాజర్షి నివాసంలో ఆయన్ను సభ్యులు సత్కరించి అభినందించారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన జాతీయ కళారంగ దినోత్సవంలో రాజర్షి రాష్ట్రస్థాయిలో కందుకూరి పురస్కారం అందుకుకోవడం గర్వకారణం అని చిలకమర్తి సభ్యులు పేర్కొన్నారు. ప్రభుత్వ ఉపాధ్యాయునిగా విధులు నిర్వహిస్తూనే రెండు వందలకు పైగా ప్రాంతీయ, జాతీయ స్థాయిలో పురస్కారాలు అందుకోవటం రాజర్షి కళాతృష్ణకు నిదర్శనంగా నిలిచిందన్నారు. నిడదవోలు రామారావు, అనిపెద్ది రాధాకృష్ణ పాల్గొన్నారు.

శ్రీవారిని దర్శించుకున్న సినీ నటుడు బాలాజీ



శ్రీవారి ఆలయ ధ్వజస్తంభం వద్ద విలేకర్లతో మాట్లాడుతున్న సినీ నటుడు బాలాజీ

ద్వారకాతిరుమల: ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామివారిని సినీ నటుడు బాలాజీ ఆదివారం సందర్శించారు. ఆలయానికి విచ్చేసిన ఆయన ముందుగా స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు జరుపుకున్నారు. ఆ తరువాత ఆలయ ముఖ మండపంలో పండితులు ఆయనకు శ్రీవారి శేష వస్త్రాన్ని కప్పి, వేద ఆశీర్వచనాన్ని పలికారు. అనంతరం ధ్వజస్తంభం వద్ద బాలాజీ విలేకర్లతో మాట్లాడారు. శ్రీ వేంకటేశ్వర స్వామివారికి సంబంధించిన చిత్రాన్ని ద్వారకాతిరుమల క్షేత్రంలో జూన్‌లో ప్రారంభించనున్నామని, ఈ నేపథ్యంలోనే శ్రీవారిని దర్శించుకున్నట్టు చెప్పారు.

ఆర్యవైశ్యులు అన్ని రంగాల్లో రాణించాలి



సభలో మాట్లాడుతున్న జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య)

ద్వారకాతిరుమల: ఆర్యవైశ్యులు అన్ని రంగాల్లో రాణించాలని జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) అన్నారు. ద్వారకాతిరుమల క్షేత్ర శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి ఆర్య వైశ్య కల్యాణ మండపం ట్రస్ట్ రజతోత్సవ సభ స్థానిక కల్యాణ మండపంలో ఆదివారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో శ్రీరాం రాజగోపాల్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ముందుగా వాసవీ మాతను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. సంఘ నేతలు ఇమ్మడి రత్నాజీ, మానేపల్లి సత్యనారాయణ, ఇమ్మడి నాగు, నార్ల కాశీనాథం పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు



గాయపడిన రామకృష్ణను పరిశీలిస్తున్న మంత్రి నాదెండ్ల

ద్వారకాతిరుమల: మండలంలోని ఎం.నాగులపల్లి వద్ద జాతీయ రహదారిపై ఆదివారం జరిగిన ఒక రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు తీవ్ర గాయాలపాలయ్యారు. స్థానికుల కథనం ప్రకారం. పెదవేగి మండలం చక్రాయిగూడెంకు చెందిన యాండ్ర రామకృష్ణ, దొంగల రాజీవీర్ నల్లజర్ల మండలం ఘంటావారిగూడెంలో జరుగుతున్న జాతర కార్యక్రమానికి బైక్‌పై వెళుతున్నారు. ఘటనా స్థలం వద్దకు వచ్చేసరికి ఏలూరు నుంచి కొవ్వూరు వైపునకు వెళుతున్న ఇన్నోవా కారు వీరి బైక్‌ని వెనుక నుంచి ఢీకొట్టింది. దాంతో రోడ్డుపై పడిపోవడంతో రామకృష్ణ, రాజీవీర్ తీవ్రంగా గాయపడ్డారు. ఆ సమయంలో విజయవాడ నుంచి కాకినాడకు కారులో వెళుతున్న పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఘటనా స్థలం వద్ద ఆగి, క్షతగాత్రులను పరిశీలించారు. అనంతరం వారిని 108 అంబులెన్స్‌లో ఎక్కించి, తన కాన్వాయ్‌లోని కారును ఎస్కార్ట్‌గా ఇచ్చి, ఏలూరు ప్రభుత్వాస్పత్రికి పంపించారు. మెరుగైన వైద్యం అందేలా చూడాలని ఎస్పీకి ఫోన్ చేసి చెప్పారు.

గృహోపకరణాల దగ్ధం

కొయ్యలగూడెం: స్థానిక కండవల్లి గాంధీ సుధీర్ కుమార్ ఇంట్లో ఆదివారం జరిగిన అగ్ని ప్రమాదంలో గృహోపకరణాలు దగ్ధమయ్యాయి. సుమారు రూ.1.80 లక్షల నష్టం సంభవించిందని సుధీర్ కుమార్ తెలిపారు. షార్ట్ సర్క్యూట్ కారణంగా ఈ ప్రమాదం జరిగినట్లు అధికారులు భావిస్తున్నారు.

అలంకారప్రాయంగా సెంటర్ లైటింగ్

- శిథిలావస్థలో విద్యుత్ స్తంభాలు
- పట్టించుకోని కూటమి ప్రభుత్వం
- అంధకారంలో చింతలపూడి పట్టణ ప్రజలు



చింతలపూడిలో అలంకారప్రాయంగా ఉన్న సెంటర్ లైటింగ్ విద్యుత్ స్తంభాలు

చింతలపూడి: చింతలపూడి పట్టణ వాసులకు సెంటర్ లైటింగ్ కలగానే మిగిలిపోయింది. అధికారంలోకి రాగానే సెంటర్ లైటింగ్‌ను వెలిగిస్తామని గత ఎన్నికల్లో కూటమి నాయకులు హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి 10 నెలలు గడచిపోతున్నా ఇంత వరకు సమస్య పరిష్కారం కాలేదని పట్టణ ప్రజలు ఆరోపిస్తున్నారు.

గతంలో పాటించిన నాణ్యతా ప్రమాణాలు

గతంలో కోటి రూపాయల వ్యయంతో ఏర్పాటు చేసిన సెంటర్ లైటింగ్ ప్రస్తుతం అలంకార ప్రాయంగా మారింది. అప్పట్లో సెంటర్ లైటింగ్ పనుల్లో నాసిరకం కేబుల్ వైర్లు, లైట్లు వాడడం కారణంగానే ఈ దుస్థితి ఏర్పడిందని ప్రజలు విమర్శిస్తున్నారు. రోడ్డు విస్తరణ అనంతరం 2008లో స్థానిక సాయిబాబా గుడి వద్ద నుంచి బోయగూడెం వరకు 80 విద్యుత్ స్తంభాలను నిర్మించి 160 లైట్లను ఏర్పాటు చేశారు. కాంట్రాక్టర్ సరైన నాణ్యతా ప్రమాణాలు పాటించని కారణంగా తరచూ వైర్లు కాలిపోయి లైట్లు వెలిగేవి కావు. ఆ తరువాత ట్రాన్స్‌కో అధికారులు పంచాయతీ విద్యుత్ బిల్లులు చెల్లించని కారణంగా సెంటర్ లైటింగ్‌కు విద్యుత్ సరఫరా నిలిపివేశారు. దీంతో పట్టణ ప్రజలు అంధకారంలో మగ్గవలసి వచ్చేది. అనంతరం 2018లో అధికారులు రోడ్డుకు ఇరుపక్కలా మరలా వీధిలైట్లు ఏర్పాటు చేయడంతో సమస్య కొంతమేర తీరింది.

నేలకొరుగుతున్న విద్యుత్ స్తంభాలు

ఇదిలా ఉండగా సెంటర్ లైటింగ్ కోసం నిర్మించిన విద్యుత్ స్తంభాలు ఒక్కొక్కటిగా నేలకొరుగుతున్నాయి. బోయగూడెం పెట్రోలు బంకు సమీపంలో వాహనాలు ఢీకొని చాలా వరకు స్తంభాలు నేలకొరిగాయి. సాయిబాబా గుడి సమీపంలో కూడా వాహనాల ధాటికి విద్యుత్ స్తంభాలు విరిగిపోయాయి. ఉన్న స్తంభాలు కూడా శిథిలావస్థకు చేరాయి. వీటిని మరమ్మతు చేయించి పట్టణంలో సెంటర్ లైటింగ్‌ను వెలిగించాలని ప్రజలు అనేక మార్లు అధికారులకు మొరపెట్టుకున్నారు. ప్రస్తుతం చింతలపూడి నగర పంచాయతీగా అభివృద్ధి చెందింది. కాని దశాబ్దాల కాలంగా ఉన్న సెంటర్ లైటింగ్ సమస్య మాత్రం అలాగే ఉంది. ఇప్పటికైనా డివైడర్‌ను తొలగించి కొత్త డివైడర్ నిర్మాణం చేపట్టి సెంటర్ లైటింగ్ వెలిగించాలని పట్టణ ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

సెంటర్ లైటింగ్ వెలిగించాలి



సెంటర్ లైటింగ్‌ను వినియోగంలోకి తీసుకురావాలి. పట్టణ ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకుని ప్రతి రోజూ సెంటర్ లైటింగ్ వెలిగేలా చర్యలు తీసుకోవాలి. ఉన్న విద్యుత్ స్తంభాలు శిథిలావస్థకు చేరి కూలిపోతున్నాయి. అధికారులు వాటి స్థానంలో కొత్త స్తంభాలు ఏర్పాటు చేయాలి.

– బొడ్డు వెంకటేశ్వర్రావు, వైఎస్సార్ సీపీ మున్సిపల్ విభాగం జిల్లా అధ్యక్షుడు

నాసిరకం వైర్లు తొలగించాలి



పట్టణంలో సెంటర్ లైటింగ్‌కు వినియోగించిన నాసిరకం వైర్లు తొలగించి, నాణ్యమైన కేబుల్ వైర్లు వేయాలి. విద్యుత్ స్తంభాలు పడిపోకుండా డివైడర్‌ను పటిష్ట పరచి సెంటర్ లైటింగ్‌ను వెలిగించాలి.

– డి రామరాజు నాయక్, వైఎస్సార్ సీపీ నాయకుడు

నేడు వర్జీనియా రైతులకు మద్దతుగా ఆందోళన

కొయ్యలగూడెం: వర్జీనియా పొగాకు రైతులకు మద్దతుగా సోమవారం మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు ఆందోళన కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ తుమ్మలపల్లి గంగరాజు తెలిపారు. వర్జీనియా పొగాకు ధర పతనం కావడంతో గిట్టుబాటు ధర లభించక రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో వారికి మద్దతుగా బాలరాజు ఆందోళన కార్యక్రమం చేపట్టినట్లు చెప్పారు. వర్జీనియా పొగాకు వేలం కేంద్రం వద్ద నిర్వహించే ఈ కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ శ్రేణులతో సహా ప్రజాప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

పీసా కమిటీ సభ్యులతో సమావేశం

వేలేరుపాడు: స్థానిక సీపీఐ కార్యాలయంలో పీసా కమిటీ సభ్యుల సమావేశం బంధం నాగేశ్వరావు అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా సీపీఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య, పార్టీ రాష్ట్ర సమితి సభ్యులు ఎండీ మునీర్ హాజరై మాట్లాడారు. పీసా చట్టాలపై అవగాహన, ఏజెన్సీ ప్రాంతంలో టీఎస్ కమిటీలు చేయాల్సిన పనులపై వివరించారు.

విద్యుత్ వైర్లు తగిలి ఎండు గడ్డి దగ్ధం



ట్రాక్టర్‌పై దగ్ధమవుతున్న ఎండు గడ్డి

ద్వారకాతిరుమల: ట్రాక్టర్‌లో తరలిస్తున్న ఎండు గడ్డికి విద్యుత్ వైర్లు తగలడంతో గడ్డి పూర్తిగా దగ్ధమైంది. ఈ ఘటన మండలంలోని సత్తాల పంచాయతీ, సంద్రకుంట గ్రామంలో ఆదివారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం. ఉంగుటూరు మండలం కొండ్రుపాడు నుంచి ట్రాక్టర్‌లో ఎండుగడ్డి సత్తాల వైపునకు వెళుతోంది. సంద్రకుంట శివారులోకి వచ్చేసరికి గడ్డిలోంచి పొగలు రావడాన్ని డ్రైవర్ గుర్తించాడు. వెంటనే ట్రాక్టర్‌ను రోడ్డు పక్కన నిలిపివేసి, మంటలను ఆర్పే ప్రయత్నం చేశాడు. అయితే గడ్డి పూర్తిగా దగ్ధమైంది. గడ్డికి పైన విద్యుత్ తీగలు తగలడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు చెబుతున్నారు.

అకాల వర్షంతో అవస్థలు



లక్కవరంలో ధాన్యం బస్తాలపై బరకాలు కప్పుతున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం పట్టణం, మండలంలో ఆదివారం భారీ ఈదురుగాలులతో వర్షం కురిసింది. ఉదయం ఒక్కసారిగా ఆకాశం మేఘావృతం కాగా నెమ్మదిగా ప్రారంభమైన గాలులు తీవ్ర రూపం దాల్చి భారీ స్థాయిలో వీచాయి. అనంతరం పిడుగులతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో జనజీవనం స్తంభించింది. సుమారు 11 గంటల వరకు ఈ వాతావరణం కొనసాగింది.

పంటను ఒబ్బిడి చేసుకున్న రైతులు

పట్టణం, మండలంలో కురిసిన భారీ వర్షానికి రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వాతావరణం ఒక్కసారిగా మేఘావృతం కావడంతో రైతులు వ్యవసాయ క్షేత్రాలకు పరుగులు తీశారు. కళ్లాల్లో ఉన్న ధాన్యాన్ని కాపాడుకునే ప్రయత్నం చేశారు. ధాన్యం రాశులు, బస్తాలు తడకుండా బరకాలు కప్పుకున్నారు. మండలంలోని ప్రతీ గ్రామంలో చాలా వరకు కోతలు పూర్తయ్యాయి. ధాన్యాన్ని మిల్లులకు తరలించాల్సి ఉంది. అకస్మాత్తుగా వాతావరణం మారిపోవడం, వర్షం పడటంతో రైతులు తమ పంటను ఒబ్బిడి చేసుకునేందుకు నానా తంటాలు పడ్డారు.

కూరగాయ తోటలకు సైతం..

ఈదురుగాలులతో కూడిన వర్షానికి ఒక పక్క మామిడి పంట తీవ్రంగా నష్టపోగా, మరోపక్క పందిళ్లపై ఉన్న కూరగాయ తోటలకు నష్టం సంభవించింది. మామిడి పంట చేతికి వస్తున్న సమయంలో ఈదురుగాలులు వీస్తుండటంతో నష్టం ఎక్కువగా ఉండే అవకాశం ఉందని రైతులు వాపోతున్నారు. కాయలు రాలిపోవడంతో ఏమి చేయాలో దిక్కుతోచని స్థితిలో రైతులు ఉన్నారు. అలాగే బీరపాదులు, కూరగాయల పంటలు సైతం నష్టానికి గురయ్యాయి.

ఏజెన్సీలో భారీ వర్షం

బుట్టాయగూడెం: ఏజెన్సీ ప్రాంతంలో ఆదివారం ఆకస్మికంగా ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఉదయం 8 గంటల వరకూ వాతావరణం బాగానే ఉన్నప్పటికీ తర్వాత ఆకాశం మేఘావృతమై ఒక్కసారిగా కారుమబ్బులు కమ్మేశాయి. అనంతరం ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. గిరిజన గ్రామాల్లో ఈదురు గాలులు కూడా విపరీతంగా వీయడంతో పలుచోట్ల చెట్ల కొమ్మలు విరిగిపడ్డాయి. అలాగే విద్యుత్ స్తంభాలు కూడా నేలకొరగడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. లంకపాకలలో విపరీతమైన ఈదురు గాలులు వీయడంతో పలు ఇళ్లపై వేసిన షెడ్‌లు కూడా ఎగిరిపోయాయి.



కళ్లాల్లో ఉన్న ధాన్యంపై బరకాలు కప్పిన దృశ్యం



పట్టెన్నపాలెంలో నేలవాలిన బీరపాదుల పందిరి

కరాటే విజేతలకు అభినందనలు



చాంపియన్‌షిప్ పోటీల్లో గెలిచిన విజేతలను అభినందిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: స్థానిక స్పోర్ట్స్ కరాటే అకాడమీలో ఆదివారం కరాటే విద్యార్థులకు బెల్ట్ టెస్టులు నిర్వహించారు. అనంతరం ఇటీవల వైజాగ్‌లో నిర్వహించిన అంతర్జాతీయ కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో విజేతలైన క్రీడాకారులను అభినందించారు. ఈ సందర్భంగా ఇంటర్నేషనల్ కరాటే అసోసియేషన్ రిఫరీ అండ్ కోచ్ ఇబ్రహీం మాట్లాడుతూ చాంపియన్ షిప్ పోటీల్లో వివిధ కేటగిరీల్లో 7 గోల్డ్, 6 సిల్వర్, 4 బ్రాంజ్ మెడల్స్ సాధించినట్లు చెప్పారు. స్టేట్ కరాటే చాంపియన్‌షిప్‌లో 2 గోల్డ్, 5 సిల్వర్, 7 బ్రాంజ్ మెడల్స్ సాధించినట్లు వివరించారు. ఈ సందర్భంగా విజేతలను పెనుమర్తి రామ్‌కుమార్, రావూరి కృష్ణ, కర్పూరం గుప్త, సిస్టర్ రత్నమేరీ అభినందించారు.

వ్యవసాయ క్షేత్రాలను పరిశీలించిన ఆర్డీవో



పుట్లగట్లగూడెంలో వ్యవసాయ క్షేత్రంలో రైతుతో మాట్లాడుతున్న ఆర్డీవో రమణ

జంగారెడ్డిగూడెం: వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో రైతులు తమ పంటలను సంరక్షించుకోవాలని ఆర్డీవో ఎంవీ రమణ అన్నారు. జంగారెడ్డిగూడెం డివిజన్ పరిధిలో వర్షానికి దెబ్బతిన్న పంటలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ రానున్న రోజుల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసిందన్నారు. ఈ నేపథ్యంలో కోతలు కోయాల్సిన పంటలతో పాటు, కళ్లాల్లో ఉన్న ధాన్యాన్ని రైతులు ఒబ్బిడి చేసుకోవాలని ఆర్డీవో సూచించారు. అలాగే ధాన్యం తడవకుండా ధాన్యం రాశులతో పాటు, బస్తాల్లో ఉన్న వాటిని సురక్షిత ప్రాంతాలకు తరలించడం, బరకాలు కప్పడం ద్వారా రక్షించుకోవచ్చన్నారు. ధాన్యాన్ని తరలించేందుకు లారీలు ఏర్పాటు చేస్తామని, అలాగే రైతులకు అవసరమైన గోనె సంచులను సైతం సిద్ధం చేస్తామని తెలిపారు. కాగా, ఆదివారం జంగారెడ్డిగూడెం మండలం పుట్లగట్లగూడెం, కొయ్యలగూడెం మండలం గంగవరం గ్రామాల్లో ఆర్డీవో పర్యటించి రైతులకు పలు సూచనలు చేశారు. జంగారెడ్డిగూడెం మండలంలో కళ్లాల మీద 3 వేల మెట్రిక్ టన్నులు ధాన్యం ఉన్నట్లు మండల వ్యవసాయాధికారి కేవీ పోశారావు తెలిపారు. ఆదివారం మండలంలో ఆయన పర్యటించారు.

డివిజన్‌లో మొత్తం 200.4 మి.మీ. వర్షపాతం నమోదు

జంగారెడ్డిగూడెం డివిజన్‌లో మొత్తం 200.4 మి.మీ. వర్షపాతం నమోదైంది. డివిజన్‌లోని మండలాల వారీగా జంగారెడ్డిగూడెం 39.6 మి.మీ., కొయ్యలగూడెం 6.8, బుట్టాయగూడెం 33.2, జీలుగుమిల్లి 15, కుక్కునూరు 8.2, వేలేరుపాడు 9.6, ద్వారకాతిరుమల 10, కామవరపుకోట 16.8, టి.నరసాపురం 22.4, పోలవరంలో 38.8 మి.మీ. వర్షపాతం నమోదైంది.

8న కలెక్టరేట్ వద్ద ధర్నాను జయప్రదం చేయాలి



ఎంఎల్ ప్రజాపంథా ఏలూరు జిల్లా కమిటీ సమావేశ దృశ్యం

వేలేరుపాడు: రైతు, కూలీల సమస్యలపై అఖిలభారత ఐక్య రైతు సంఘం ఆల్ ఇండియా కమిటీ పిలుపు మేరకు ఈనెల 8న ఏలూరు కలెక్టరేట్ వద్ద నిర్వహించే ధర్నాను జయప్రదం చేయాలని సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా నేతలు పిలుపునిచ్చారు. పార్టీ జిల్లా కమిటీ సమావేశం గడ్డాల ముత్యాలరావు అధ్యక్షతన వసంతవాడలో నిర్వహించారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ అన్నిరకాల పంటలకు ఎంఎస్‌పీ చట్టబద్ధం చేయాలని, చిన్న, సన్నకారు, మధ్యతరగతి రైతులకు పూర్తి రుణమాఫీ చేయాలని, అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పరస్పర సుంకాలకు లొంగొద్దని, విద్యుత్ సవరణ బిల్లును రద్దు చేయాలని, నూతన వ్యవసాయ మార్కెట్ చట్టంను రద్దు చేయాలని, ఉపాధి కార్మికులకు 200 రోజుల పని, రోజు కూలీ రూ.600 ఇవ్వాలని తదితర డిమాండ్లతో ఈ ధర్నా చేపడుతున్నట్లు ఎస్కే గౌస్ చెప్పారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకులు సిరికొండ రామారావు, కట్టం వీరా స్వామి, పోలవరం డివిజన్ కార్యదర్శి కట్టం ముత్యాలరావు తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తల పార్టీగా తీర్చిదిద్దుతా

జెట్టికి పార్టీ నేతల సత్కారం



జెట్టి గురునాథరావును అభినందిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

కొయ్యలగూడెం: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని కార్యకర్తల పార్టీగా తీర్చిదిద్దుతానని మచిలీపట్నం పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకుడు జెట్టి గురునాథరావు పేర్కొన్నారు. రాజవరం గ్రామపంచాయతీ వైఎస్సార్‌సీపీ నాయకులు ఆదివారం జెట్టిని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలుసుకుని అభినందించారు. ఈ సందర్భంగా జెట్టి మాట్లాడుతూ మహానేత వైఎస్సార్ నాటి పరిస్థితులు కార్యకర్తలకు జగన్ 2.0 పాలనలో కలగబోతోందన్నారు. కూటమి ప్రభుత్వం ప్రచార ఆర్భాటం తప్ప ప్రజా సంక్షేమం విస్మరించిందని, రైతులు గిట్టుబాటు ధర లభించక దుర్భర పరిస్థితులు ఎదుర్కొంటున్నారన్నారు. చంద్రబాబు పాలన అంటేనే క్షామం, దుర్భిక్షం, దుర్ఘటనలకు చిరునామాగా ఉందని ఇటీవల రాష్ట్రంలో సంభవించిన ప్రమాదాలతో ప్రజలు ఏకాభిప్రాయానికి వచ్చారన్నారు. వైఎస్సార్ సీపీలో క్రమశిక్షణ, సచ్ఛీలత, విశ్వాసం కలిగిన వ్యక్తులకు పార్టీ అధిష్టానం సముచిత స్థానంతో తప్పకుండా గౌరవిస్తుందన్నారు. ఈ సందర్భంగా నాయకులు పూలమాలలు వేసి జెట్టిని ఘనంగా సత్కరించారు. గంగవరం గ్రామ కన్వీనర్ కంచర్ల సత్యనారాయణ, పార్టీ నాయకులు బల్లే పాపారావు, బల్లె నాగేశ్వరరావు, ఈడ్పుగంటి తాతారావు, ఉండి ఆనందరావు, పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలి

ఏలూరు (టూటౌన్): దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను ఈ నెల 20న నిర్వహించనున్నారని, ఈ సమ్మెను జయప్రదం చేయాలని ఇఫ్టూ జిల్లా అధ్యక్షుడు కేవీ రమణ కోరారు. స్థానిక ఇఫ్టూ జిల్లా కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన ఆఫీస్ బేరర్స్ సమావేశం ఆయన మాట్లాడుతూ కార్మిక హక్కులు హరించే విధంగా ఉన్న నాలుగు లేబర్ కోడులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కార్మిక వర్గానికి కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు.

శ్రీవారికి సింహవాహన సేవ

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక రామచంద్రరావుపేట శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో జరుగుతున్న శ్రీవారి 36వ నవాహ్నిక బ్రహ్మోత్సవ సహిత చతుర్వేద హవన ప్రయుక్త విమాన సుదర్శన కలశ ప్రతిష్ఠా మహా కుంభాభిషేకాల్లో భాగంగా ఆదివారం స్వామివారికి సింహవాహన సేవ అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి ప్రత్యేక వైదిక కార్యక్రమాలు నిర్వహించి భక్తులకు తీర్థ, ప్రసాదాలు అందించారు.

ప్రజలతో ఫ్రెండ్లీగా వ్యవహరించండి

- సీఐ రాజశేఖర్
- ప్రగడవరంలో పోలీసుల పల్లె నిద్ర



ప్రగడవరంలో పల్లె నిద్ర కార్యక్రమంలో గ్రామస్తులతో సీఐ రాజశేఖర్, ఎస్సై కుటుంబరావు

చింతలపూడి: పోలీసులు ప్రజలతో ఫ్రెండ్లీగా వ్యవహరించాలని సీఐ సీహెచ్ రాజశేఖర్ అన్నారు. మండలంలోని ప్రగడవరం గ్రామంలో ఎస్పీ ప్రతాప్ శివ కిషోర్ ఆదేశాలపై శనివారం రాత్రి సీఐ రాజశేఖర్, ఎస్సై కుటుంబరావు, సిబ్బందితో కలిసి పల్లె నిద్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో ముఖాముఖి నిర్వహించారు. గ్రామంలో ఉన్న సమస్యలను గురించి గ్రామస్తులతో చర్చించారు. పోలీసు శాఖ ప్రజల రక్షణకు మాత్రమే కాదని ప్రజలతో మానవీయ సత్సంబంధాలు కలిగి ఉండాలన్నారు. పోలీసు వ్యవస్థపై ప్రజల్లో నమ్మకం పెంపొందించే దిశగా పోలీసు సిబ్బంది వ్యవహారశైలి ఉండాలన్నారు. ఈ సందర్భంగా చట్టాలను గురించి వివరించారు. సైబర్ క్రైమ్ సంబంధిత ఘటనలు ఎదురైతే వెంటనే 1930 కి సమాచారం ఇవ్వాలని, అత్యవసర పరిస్థితుల్లో ప్రజలు డయల్ 112 సేవను వినియోగించుకోవాలని కోరారు. ఏదైనా గోప్యమైన సమాచారం ఉంటే వాట్సాప్ నెంబర్ 95503 51100కు నేరుగా సమాచారం పంపించవచ్చని తెలిపారు. మాదక ద్రవ్యాల నివారణ కోసం టోల్ ఫ్రీ నెంబర్ 1972కు సమాచారం ఇవ్వవచ్చని చెప్పారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. పల్లె నిద్ర కార్యక్రమం ద్వారా గ్రామాల్లో ప్రజలతో నిత్య సంబంధాలు పెంచుకుని శాంతి భద్రతల పరిరక్షణ కోసం పోలీసు సేవలను మరింత చేరువ చేయడం లక్ష్యంగా చింతలపూడి పోలీసులు కృషి చేస్తున్నట్లు తెలిపారు.